సాక్షి చిత్తూరు


శనివారం । 13 । మే । 2023

I



భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

మాడవీధుల్లో మహా అంగప్రదక్షిణ చేసే భక్తులకు ఇబ్బంది లేకుండా రాత్రివేళ పుష్కరిణిని తెరిచి ఉంచుతామని టీటీడీ ఈవో తెలిపారు. - IIలో



'హై'బ్రిడ్ టమాట

జిల్లాలో నాటు రకం టమాటాలకు డిమాండ్ పడిపోయింది. హైబ్రిడ్ రకాలకు ధర ఆశాజనకంగా ఉంది. - IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	39	27
తిరుపతి	41	28
తిరుమల	37	24
గూడూరు	43	31
నగరి	42	28

న్యూస్‌రీల్

మహాయజ్ఞంలో వరసిద్ధుని ఆలయ సిబ్బంది



మహాయజ్ఞం వద్ద కాణిపాకం ఆలయ ఈఓ వెంకటేశు తదితరులు

కాణిపాకం(యాదమరి): విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రారంభించిన మహాయజ్ఞంలో కాణిపాకం ఆలయ ఈఓ వెంకటేశు, అధికారులు, వేదపండితులు శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కమిషనర్ సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం అష్టోత్తర శతకుండాత్మక చండీరుద్ర, రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం పూజలకు హాజరయ్యారు. ఈ క్రమంలో స్వామివారి ప్రచార రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరసిద్ధుని సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ వెంకటేశ్ నాయక్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ రవీంద్రబాబు

కాణిపాకం(యాదమరి): కాణిపాం వరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేష్ నాయక్ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వదించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

పాడి రైతుకు అండగా ప్రభుత్వం



దూడల ప్రదర్శనను ప్రారంభిస్తున్న సర్పంచ్ నిర్మల

బంగారుపాళెం: పాడి రైతుకు ప్రభుత్వం అండగా ఉందని ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ విజయమోహన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బోడబండ్లలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో పశు సంతతి పరిశీలన పథకం కింద జెర్సీ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 75 శాతం మంది రైతులు పాడిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. మేలు రకం పేయదూడల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ ప్రాముఖ్యతను తెలిపారు. పీటీపీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆసీఫ్ మాట్లాడుతూ పేయ దూడల పెంపకంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ అమరనాథ్ మాట్లాడుతూ పాల ఉత్పత్తిని పెంచి, గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం ఎంపిక చేసిన మేలు జాతి దూడలకు సంబంధించి వాటి యజమానులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ సభ్యుడు హరి, చంద్రయ్య, పశు వైద్యులు రూన్సీ, చంద్రమౌళి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేకం



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి గర్భాలయాన్ని అర్చకులు శుద్ధి చేశారు. అభిషేకానంతరం గంగమ్మ తల్లిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ కోసం ఉమ్మడి జిల్లాలోని మదనపల్లె, తిరుపతిలో 36 బెంచీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కక్షిదారులు కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు.

భీకరి.. ప్రాణాలు హరీ!



కౌండిన్య అటవీ పరిధి నుంచి ఏనుగులు యథేచ్ఛగా బయటకు వచ్చేస్తున్నాయి. తమిళనాడు.. కర్ణాటక అడవుల నుంచి సైతం జిల్లాలోకి చొరబడుతున్నాయి. సరిహద్దు గ్రామాల్లోని పొలాలపై పడి పంటలను ఆరగించేస్తున్నాయి. కంటికి కనిపించిన వారిపై దారుణంగా దాడి చేస్తున్నాయి. తొండంతో కొట్టి.. కాళ్లతో తొక్కి ఘోరంగా చంపేస్తున్నాయి. ముఖ్యంగా మదపుటేనుగులు విచక్షణా రహితంగా జనం ఉసురు తీసేస్తున్నాయి. దీంతో అటవీ సమీప ప్రాంతాల్లోని ప్రజలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. పంట నష్టంతోపాటు ప్రాణనష్టం వాటిల్లుతుండడంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఎలిఫెంట్ కారిడార్ ఏర్పాటు చేస్తేనే భీ'కరి' సమస్యను శాశ్వతంగా పరిష్కరించవచ్చని ఫారెస్ట్ అధికారులు సూచిస్తున్నారు.

- మనుషులపై దాడి చేస్తున్న మదపుటేనుగులు
- కనిపించిన వారిని వెంటాడి చంపేస్తున్న వైనం
- ఇప్పటి వరకు 16 మంది మృతి
- తమిళనాడు, కర్ణాటక నుంచి చొరబడుతున్న ఏనుగుల గుంపు
- ఎలిఫెంట్ కారిడార్‌తోనే సమస్యకు శాశ్వత పరిష్కారం



తమిళనాడు నుంచి కుప్పం సమీపంలోని నడుమూరు వద్ద జిల్లాలోకి ప్రవేశిస్తున్న ఏనుగుల గుంపు (ఫైల్)



కర్ణాటక నుంచి గుడుపల్లె మండలంలోకి వస్తున్న ఏనుగులు (ఫైల్)

పలమనేరు : జిల్లాలోని పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో గజరాజుల నుంచి జనానికి ప్రాణహాని తప్పడం లేదు. మనషులపై పగబట్టినట్టు మదపుటేనుగులు దాడి చేస్తుండడంతో ప్రజలు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. గత పదేళ్లలో ఏనుగుల కారణంగా జిల్లావ్యాప్తంగా సుమారు 16మంది మృత్యువాత పడ్డారు. తాజాగా శుక్రవారం కుప్పం సమీపంలోని పత్తిచేను వద్ద ఉష, నప్పని కుంట వద్ద శివలింగం అనే ఇద్దరు గజదాడులకు దుర్మరణం పాలయ్యారు. ఈ వారంలోనే కృష్ణగిరి వద్ద ఓ వ్యక్తిని ఏనుగులు చంపేయడం గమనార్హం. ముఖ్యంగా తమిళనాడు నుంచి వస్తున్న మదపుటేనుగులు మరింత క్రూరంగా దాడులకు దిగుతున్నాయని అటవీ అధికారులు వెల్లడిస్తున్నారు.

తమిళనాడు ఫారెస్ట్ సిబ్బంది ఫైరింగ్

ఏనుగులకు రోజూ పది హెక్టార్లలో ఫీడింగ్, 900లీటర్ల నీరు అవసరం. మేత తిన్నాక ఇవి నిత్యం 5 మైళ్ల వరకు సంచరిస్తుంటాయి. తమిళనాడులోని మోర్ధనా, కృష్ణగిరి అడవుల్లోని ఏనుగులపై తమిళనాడు అటవీశాఖ సిబ్బంది రబ్బరు బుల్లెట్లతో కాల్పులు జరుపుతున్నారు. దీంతో అక్కడ నుంచి ఏనుగులుకుప్పం, ననియాల మీదుగా కౌండిన్య వైపునకు వచ్చేస్తున్నాయి. కర్ణాటక నుంచి కూడా గుడుపల్లె, కుప్పం మీదుగా ఇదే అడవిలోకి చేరుతున్నాయి. గుంపులను వీడి ఒంటరిగా సంచరించే మదపుటేనుగులను అడవిలోకి మళ్లించేందుకు రైతులు వాటిపైకి టైర్లను కాల్చి వేయడం, రాళ్లు విసరడం, బాణసంచా పేల్చడం చేస్తున్నారు. దీంతో ఒంటరి ఏనుగులు మనుషులపై కక్ష పెంచుకుని విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతున్నాయి.

మేతకోసమే బయటకు

ఏనుగులకు అడవిలోని వెదురు లాంటి ఆహారాన్ని తినడం కంటే, పొలాల్లోని చెరుకు, కొబ్బరి, మామిడిని ఆరగించడం అంటే విపరీతమైనర ఇష్టం. మేత కోసం ఒక్కసారి వచ్చే ఏనుగు తన జీవిత కాలంలో మళ్లీ మళ్లీ అదే మార్గంలో వస్తూనే ఉంటుంది. ఇలాంటి మేతకు అలనాటు పడిన ఏనుగులు తరచూ అటవీశాఖ ఏర్పాటు చేసిన సోలార్‌ఫెన్సింగ్, ఎలిఫెంట్ ట్రెంచ్‌లను ధ్వంసమ చేసి మరీ బయటకు వచ్చేస్తున్నాయి.

రూ.40కోట్లతో ఫెన్సింగ్‌కు ప్రతిపాదన

కౌండిన్య అభయారణ్య పరిధిలో సుమారు 66 కిలోమీటర్ల మేర సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దాదాపు 74 కిలోమీటర్ల మేరకు ఎలిఫెంట్ ప్రూఫ్ ట్రెంచ్‌లను తవ్వించారు. అయితే గత ప్రభుత్వాలు ఆయా పనులను నాసిరకంగా చేపట్టడంతో ఏనుగులు వాటిని సులువుగా ధ్వంసం చేసేస్తున్నాయి. ఈ క్రమంలో కేరళ, అస్సాం తరహాలో కొత్తరకం ఫెన్సింగ్ నిర్మించేందుకు అటవీఅధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే రూ.40కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు.

జిల్లా సమాచారం

కౌండిన్య అటవీప్రాంత విస్తీర్ణం	250 చ.కి.మీ
అభయారణ్యంలోని మొత్తం ఏనుగులు	67
తమిళనాడు నుంచి తరచూ వచ్చేవి	24
కర్ణాటక నుంచి చొరబడేవి	16
ఏనుగుల దాడిలో మృతులు	16
గాయపడినవారు	20 మందికిపైగా
వివిధ కారణాలతో మృత్యువాత పడిన గజరాజులు	20

మదపుటేనుగులే డేంజర్!

పలమనేరు, కుప్పం, చిత్తూరు ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలోని కౌండిన్య అభయారణ్యంలోని ఏనుగులతోపాటు, తమిళనాడులోని మోర్ధన ప్రాంతం, కృష్ణగిరి, కావేరిపట్నం రేంజ్‌లు, కర్ణాటకలోని హోసూర్, బన్నేర్‌గట్టల నుంచి జిల్లాలోకి ఏనుగులు రాకపోకలు సాగిస్తుంటాయి.. స్థానిక గుంపుల్లో మొత్తం 12 మగ ఏనుగులుండేవి. వీటిలో ఆరు మృతి చెందాయి. మరో ఆరు ఏనుగులు(మదపుటేనుగులు) మాత్రం సంచరిస్తున్నాయి. కర్ణాటక, తమిళనాడు గుంపుల్లోని కూడా 8 దాకా మదపుటేనుగులున్నాయి. వీటిలో గుంపునుంచి బయటకు వచ్చి ఎంపిక చేసుకున్న ప్రాంతంలోనే సంచరించే ఒంటరి ఏనుగుల చాలా ప్రమాదకరం. మనుషులతోపాటు, పశువులు, కుక్కలను కూడా తరిమి తరిమి చంపేస్తుంటాయి. తాజాగా కుప్పంలో దాడులు చేసింది కూడా ఈ మదపుటేనుగులే కావడవ గమనార్హం.



ఫెన్సింగ్‌ను ధ్వంసం చేస్తున్న మదపుటేనుగు (ఫైల్)

అప్రమత్తం అవసరం



ఏనుగుల సంచారంపై సమాచారం అందిన తర్వాత జనం అప్రమత్తంగా వ్యవహరించడం అవవసరం. ఏనుగు తరుముకుంటే నేరుగా కాకుండా ఎస్ ఆకారంలో పరిగెత్తడం శ్రేయస్కరం. ఒంటిపై ఉన్న దుస్తులను తీసి ఏనుగు ముందు వేస్తే అది వాసన చూస్తూ కాసేపు ఆగుతుంది. ఆ సమయంలో తప్పించుకునే వెసులుబాటు వస్తుంది. ముఖ్యంగా ఏనుగు వెంటపడినప్పుడు పల్లం ప్రాంతంలోకి పరుగుతీయం మేలు.

– నయీమ్ అలీ, ఎఫ్ఆర్ఓ, పలమనేరు

విజ్ఞానం.. విశేషం

గ్రంథాలయాలను విజ్ఞాన కేంద్రాలుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. వేసవి సెలవుల్లో విద్యార్థులు పలు అంశాలపై అవగాహన పెంపొందించుకునేందుకు లైబ్రరీల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసింది. వివిధ పోటీలను నిర్వహిస్తూ పిల్లల మానసికోల్లాసానికి తోడ్పాటునందిస్తోంది. ఆట వస్తువులు.. కథల పుస్తకాలను అందిస్తూ ప్రోత్సహిస్తోంది.



కథ చెబుతున్న విద్యార్థి



సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థుల మెడిటేషన్

- గ్రంథాలయాల్లో విద్యార్థులకు వేసవి విడిది
- ప్రారంభమైన ప్రత్యేక శిబిరాలు
- జూన్ 11వ తేదీ వరకు కొనసాగనున్న కార్యక్రమాలు
- ఉత్సాహంగా హాజరవుతున్న పిల్లలు

పుత్తూరు రూరల్ : ప్రభుత్వం ఈ వేసవి సెలవుల్లో పిల్లలకు విజ్ఞానంతో కూడిన శిక్షణ అందించేందుకు గ్రంథాలయాలను వేదికగా చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని శాఖా గంథాలయాల్లో ఈనెల 8 నుంచి ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరాలు జూన్ 11 వరకు కొనసాగనున్నాయి. 10 నుంచి 15 ఏళ్ల లోపు బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనేలా అధికారులు కార్యాచరణ అమలు చేస్తున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రంథాలయానికి సమీప ప్రాంతంలోని విద్యార్థులను రప్పిస్తున్నారు. నిత్యం వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా పిల్లలకు విజ్ఞానం పెంపొందించేలా, మానసిక వికాసానికి సంబంధించిన ఆటపాటలు జరిపిస్తున్నారు. ఒక్కో గ్రంథాలయంలో కనీసం 30 మంది నుంచి 60 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. అందుకు అనుగుణంగా ప్రతి గ్రంథాలయంలో ఒక క్వాలిఫైడ్ టీచర్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే టీచర్లకు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులను పిలిపించి వారి అనుభవాలను పిల్లలకు వివరించేలా చర్యలు చేపట్టారు. రచయితలు, డ్రాయింగ్ మాస్టర్లు ఇలా పలు రంగాలకు చెందిన వారితో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఈ క్రమంలోనే శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు బహూకరిస్తున్నారు.

నిర్వహణ ఇలా..

- ఉదయం 8 నుంచి 8.30 వరకు కథలు చెప్పించడం
- 8.30 నుంచి 9 వరకు పుస్తక పఠనం
- 9 నుంచి 9.30 వరకు డ్రాయింగ్
- 9.30 నుంచి 10 వరకు స్పోకెన్ ఇంగ్లిష్
- 10 నుంచి 10.30 వరకు విరామం
- 10.30 నుంచి 11 వరకు కథలు చెప్పడం
- 11 నుంచి 11.30 వరకు అతిథులతో స్ఫూర్తిదాయక ప్రసంగాలు
- 11.30 నుంచి 12 గంటల వరకు నృత్యాలు, నాటికలు, బొమ్మల తయారీ, ఆటలు

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



గ్రంథాలయాల అభివృద్ధి విశేషంగా కృషి చేస్తున్నాం. పోటీ పరీక్షల కోసం రూ.7 లక్షల పుస్తకాలను కొనుగోలు చేసి అందుబాటులో ఉంచాం. చిత్తూరులో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. శ్రీకాళహస్తిలో రూ.కోటి, తొట్టంబేడులో రూ.25 లక్షలతోకొత్త భవనాలు నిర్మిస్తున్నాం. వరదయ్యపాళెం, కుప్పంలో త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. ఈ క్రమంలోనే విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నాం.

– సైనారు మధుబాల, గ్రంథాలయ సంస్థ చైర్మన్

సమ్మర్ క్యాంప్ తప్పనిసరి



ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 71 గ్రంథాలయాల్లో 6,13,023 పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉన్నాయి. అన్ని గ్రంథాలయాల్లో తప్పనిసరిగా సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించాలని ఆదేశించాం. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు జరిపిస్తున్నాం. పెద్ద సంఖ్యలో విద్యార్థులు క్యాంప్‌నకు వచ్చేలా విస్తృతంగా ప్రచారం చేయించాం.

– ఎస్ఎస్ లావణ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. పిల్లలు తమ ప్రజ్ఞాపాటవాలను పెంపొందించుకునేందుకు ఈ శిబిరాలు ఉపయోగపడతాయి. ఆ మేరకు తల్లిదండ్రులు సైతం పిల్లలను ప్రోత్సహించాలి. అన్ని విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తున్నాం.

– కె.మీనాకుమారి, గ్రంథాలయాధికారి, పుత్తూరు

జిమ్ పరికరాల తరలింపు నిలిపివేత

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులోని శ్రీనివాస ప్రభుత్వ క్రీడామైదానం నుంచి జిమ్ పరికరాల తరలింపును అధికారులు నిలిపివేశారు. వివరాలు.. క్రీడాకారులు వ్యాయామం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా జిమ్ ఏర్పాటు చేసింది. శాప్ ద్వారా రూ.10,19,663 విలువైన 11 రకాల పరికరాలను అందించింది. అయితే నగరి క్రీడా వికాస కేంద్రానికి వాటిని రీ అలాట్ చేస్తూ ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఉత్తర్వులు జారీ చేయడంతో అధికారులు తరలింపు ప్రక్రియను శుక్రవారం చేపట్టారు. దీనిపై క్రీడా సంఘాల నాయకులు కుమారస్వామిరెడ్డి, దినకర్, శ్రీకాంత్, గోపీ తదితరులు నిరసన చేపట్టారు. పరికరాలను తరలించే వాహనాన్ని అడ్డుకుని అధికారులతో వాగ్వాదానికి దిగారు. సామాజిక మాధ్యమాల్లో విషయం మంత్రి ఆర్కే రోజా దృష్టికి వెళ్లడంతో ఆమె స్పందించారు. నగరిలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో జిమ్ పరికరాలను నెల రోజుల పాటు వినియోగించుకునేందుకు శాప్ అనుమతి తీసుకున్నట్లు వెల్లడించారు. ఎవరో ఉద్దేశపూర్వకంగానే నానా యాగీ చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై క్రీడామైదానం చీఫ్ కోచ్ బాలాజీ మాట్లాడుతూ వీసీఎండీ, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఆదేశాల మేరకు చిత్తూరు నుంచి కొన్ని జిమ్ పరికరాలను నగరి క్రీడావికాస కేంద్రానికి తరలించేందుకు చర్యలు చేపట్టామన్నారు. చిత్తూరు లోని క్రీడాకారుల ఆందోళనను కలెక్టర్‌కు తెలియజేయడంతో ఆయన పరికరాల తరలింపును నిలిపివేయాలని ఆదేశించారని వెల్లడించారు.



జిమ్ వద్ద నిరసన తెలుపుతున్న క్రీడాకారులు

పొంగళ్లు.. భక్తి పరవళ్లు!



పొన్నియమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పొంగిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో పొన్నియమ్మ

- చిత్తూరులో జాతర సంబరం
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తజనం

చిత్తూరు రూరల్ : చిత్తూరులో గంగ జాతర సంబరం మొదలైంది. ఈ నెల 16, 17వ తేదీల్లో వైభవంగా నిర్వహించనున్న జాతరను పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని పలు ఆలయాల వద్ద భక్తులు పొంగళ్లు పొంగించారు. ముఖ్యంగా పొన్నియమ్మ ఆలయం వద్ద పెద్దసంఖ్యలో మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ క్రమంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వంశపారంపర్య ధర్మకర్త సీకే బాబు సతీమణి లావణ్య కూడా అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ముత్యాలమ్మ, గిరింపేట, సంతపేటలోని దుర్గమ్మ ఆలయాల వద్ద కూడా అధిక సంఖ్యలో భక్తులు పొంగళ్లు పొంగించడం విశేషం.

చుక్కల భూములపై నిషేధం తొలగింపు



జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని రొంపిచెర్ల మండలంలో 94.64 ఎకరాల చుక్కల భూములను నిషేదిత జాబితా నుంచి తొలగించినట్లు జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 173 ప్రకారం మండలంలోని 54 సర్వే నంబర్లను నిషేదిత జాబితాను తొలగించినట్లు వెల్లడించారు. ఈ భూముల మార్కెట్ విలువ సుమారు రూ.382.56 కోట్లు ఉంటుందని వివరించారు. ప్రస్తుతం విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు 1బీ, అడంగళలో ఇది మరకు నమోదైన వారి పేర్లను జాబితా నుంచి తొలగిస్తామన్నారు. రిజిస్టర్ డాక్యుమెంట్ ఉన్నా, లేకున్నా, సాదా బైనామా ప్రకారం సంబంధిత తహసీల్దార్లు వెంటనే నిషేధ జాబితా నుంచి వాటిని తొలగించాలని ఆదేశించారు. రెవెన్యూ రికార్డుల్లో పట్టాదారు పేరు లేకున్నా, క్రయవిక్రయ అనుమతి ఉన్నందున మ్యూటేషన్ చేయవచ్చని స్పష్టం చేశారు.

విజయ డెయిరీ పరిశీలన

చిత్తూరు అగ్రికల్చర్: నగరంలోని విజయ డెయిరీని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. డెయిరీ ఆవరణలో ముళ్ల కంపలు, పిచ్చిమొక్కల తొలగింపును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఒప్పందం ప్రకారం అమూల్ సంస్థ త్వరలోనే డెయిరీలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డెయిరీ ఉద్యోగులు తమకు పెండింగ్ వేతనాలను మంజూరు చేయించాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ అముద, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి వనజ పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

రేపు పలమనేరులో 'వృషభ' ట్రైలర్

పలమనేరు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం సాయంత్రం వృషభ చిత్రం ట్రైలర్ విడుదల చేయనున్నట్లు నిర్మాత సి.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గోమాతకు మనిషికి ఉన్న బంధంపై సినిమా ఉంటుందన్నారు. జీవన్‌రెడ్డి, అలేఖ్య నటిస్తున్నారని, అశ్విని కామరాజ్ దర్శకత్వం వహిస్తున్నారని వివరించారు.



లొకేషన్‌లో చిత్రబృందం

ఆస్తి వివాదంలో అన్న మృతి

బంగారుపాళెం : మండలంలోని బండ్లదొడ్డి గ్రామంలో ఆస్తికోసం రెండు కుటుంబాలు పరస్పరం దాడులకు పాల్పడడంతో ఒకరు మృతి చెందారు. వివరాలు.. సుబ్రమణ్యం, మొగిలప్ప అన్నదమ్ములు. వీరి కుటుంబాలకు సుమారు 15 ఏళ్లుగా ఆస్తితగాదాలు ఉన్నాయి. ప్రస్తుతం కోర్టులో వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మళ్లీ ఇరు కుటుంబాల వారు ఘర్షణ పడ్డారు. ఈ దాడుల్లో సుబ్రమణ్యం తీవ్రంగా గాయపడ్డాడు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. సీఐ నరసింహారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైబ్రిడ్ టమాట!

- నాటు కాయలకు తగ్గిన డిమాండ్
- లోకల్ సరుకు కారణంగా పడిపోయిన రేట్లు
- రవాణా.. పల్ప్‌కు అనుకూలంగా ఉండడంతో హైబ్రిడ్‌కు ధర

పలమనేరు: జిల్లాలో పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లోని రైతులు టమాట సాగును అధికంగా చేపడతున్నారు. నీటి సౌకర్యం ఉన్నవారికి అయితే టమాటానే ప్రధాన పంట. పలమనేరు, వి.కోట, కుప్పం, ఏడోమైలు, పుంగనూరులో టమాట మార్కెట్‌లున్నాయి. ఇక్కడి రైతులు నాటు రకాలైన సాహు, ప్రభాకర్-34, సాహిత్, సలార్, సింజెంటా బాహుబ 3,400 హెక్టార్లలో, హైబ్రిడ్ రకాలైన సింజెంటా వారి 6242, అభినవ్, అభిషేక్, నాందారి 600 హెక్టార్లలో సాగు చేశారు.



ధర లేక పలమనేరులో రోడ్డు పక్కన టమాటాలను పడేస్తున్న రైతులు



పలమనేరు మార్కెట్‌కు వచ్చిన నాటు రకం టమాటాలు

హైబ్రిడ్‌కు డిమాండ్ ఎందుకంటే..

నాటు రకాలను కేవలం ఆహారానికి మాత్రమే ఉపయోగిస్తారు. ఇక్కడినుంచి ఎక్కువగా తమిళనాడుకు టమాటాలు ఎగుమతి చేస్తున్నారు. ఆప్రాంతంలోనూ ఇప్పుడు లోకల్ టమాటా పంట అందుబాటులోకి వచ్చింది. సప్లయ్ కావాల్సినంత ఉండడంతో నాటు రకాలకు ధర తగ్గింది. అదే హైబ్రిడ్ రకాలైతే దూర రాష్ట్రాలు, పలు దేశాలకు రవాణా చేసేందుకు వీలుంటుంది. అలాగే జ్యూస్ ఫ్యాక్టరీలైతే హైబ్రిడ్ రకాలను మాత్రమే కొనుగోలు చేస్తున్నాయి.పైగా హైబ్రిడ్ సాగు తక్కువగా ఉంది. దీంతో వీటికి మంచి డిమాండ్ ఉండడంతో ధరల ఆశాజనంగా మారాయి.

రెండింటి ధరల్లో వ్యత్యాసం

నాటు రకాలకు మార్కెట్లలో ప్రస్తుతం బాక్సు ధర రూ. 50 నుంచి రూ.60 దాకా ఉంది. దీంతో గిట్టుబాటు కాక .రైతులు తోటల్లోనే కాయలను వదిలేస్తున్నారు. మరికొందరు మార్కెట్‌కు తీసుకొచ్చి కొనేవారు లేక రోడ్ల పక్కన పడేస్తున్నారు. అదే హైబ్రిడ్ రకాలకు కర్ణాటకలోని కోలార్ మార్కెట్ అందుబాటులో ఉంది. అక్కడ బాక్సు ధర రూ. 260 పైగా ఉంది. అక్కడి మండీ వ్యాపారులే ఇక్కడి హైబ్రిడ్ తోటల వద్దకు వాహనాలను పంపి మరీ కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా హైబ్రిడ్ రకాలను సాగుచేసిన రైతులు లాభాల బాటన పయనిస్తున్నారు. నాటుకు హైబ్రిడ్‌కు మధ్య రూ.200 దాకా ధరలో వ్యత్యాసం కనిపిస్తోంది.

జిల్లాలోనే పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో టమాట సాగు అధికం. అయితే ప్రస్తుతం నాటు రకాలకు రేటు పడిపోయింది. దీనికితోడు లోకల్ సరుకు మార్కెట్‌లోకి ఎక్కువగా వస్తుండడంతో ఎగుమతి తగ్గిపోయింది. ఈ క్రమంలో హైబ్రిడ్ టమాటాకు మాత్రం డిమాండ్ పెరుగుతోంది. రవాణాకు అనుకూలంగా ఉండడంతో ధర ఆశాజనకంగా మారింది. అలాగే జ్యూస్ ఫ్యాక్టరీలు సైతం హైబ్రిడ్ కొనుగోలుకే మొగ్గుచూపుతుండడంతో నాటు టమాటాలను పండించిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఈ మేరకు డిమాండ్‌కు అనుగుణంగా హైబ్రిడ్ వంగడాలనే సాగు చేసుకోవాలని ఉద్యానశాఖ సూచిస్తోంది.

ఉద్యానశాఖ సూచనలతో..



ఉద్యానశాఖ అధికారుల సూచనల మేరకు సింజెంటా కంపెనీకి చెందిన 6242 రకాన్ని నాలుగెకరాల్లోసాగుచేశా. 600 బాక్సులు దిగుబడి వచ్చింది. కోలారు వ్యాపారులే తోట వద్దకు వచ్చి కొనుగోలు చేశారు. గిట్టుబాటు ధర చెల్లించారు. కొత్త వెరైటీలను సాగుచేస్తే టమాటా లాభదాయకమే.
– సుబ్రమణ్యంరెడ్డి, రైతు, కల్లాడు, పలమనేరు మండలం

అవగాహన అవసరం



ఈ ప్రాంతం టమాటా సాగుకు అనుకూలంగా ఉంటుంది. రైతులకు నష్టాలు రాకుండా ఉండాలంటే హైబ్రిడ్ రకాలపై అవగాహన పెంపొందించుకోవాలి. కుప్పంలోని సీఐఓ (సెంటర్‌ఫర్ ఎక్సెలెన్స్) నుంచి హైబ్రిడ్ టమాటా సీడ్స్‌ను సబ్సిడీతో రైతులకు అందిస్తున్నాం. సలహాలు, సూచనలకోసం ఉద్యానశాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచిస్తున్నాం. – **కోటేశ్వరావు, హార్టికల్చర్ ఏడీ, పలమనేరు**



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.78,000
రిటైల్ వెండి గ్రాము	రూ.80

వివాహిత మృతిపై కేసు

సోమల: మండలంలోని బసవపల్లెలో శుక్రవారం ఉదయం భాగ్యమ్మ (32) అనే వివాహిత మరణించింది. దీనిపై ఆమె తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మధు తెలిపారు. బైరెడ్డిపల్లె మండలం ఏటుగట్టుకు చెందిన రమణప్ప కుమార్తె భాగ్యమ్మకు గంగినాయుడుపల్లెకు చెందిన లక్ష్మీనరసింహాతో పదిహేనేళ్ల క్రితం వివాహమైంది. ఓ పెళ్లికి హాజరయ్యేందుకు భార్యాభర్తలు బసవపల్లెకు వచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 6గంటలకు లక్ష్మీనరసింహా తన కుమారుడు కిషోర్‌కు ఫోన్ చేసి భాగ్యమ్మ మరణించినట్లు తెలిపాడు. దీంతో రమణప్ప తన కుమార్తె మృతిపై అనుమానం ఉందని పోలీసులను ఆశ్రయించాడు.

బాలిక అదృశ్యంపై..

పెద్దపంజాణి: మాదనపల్లె పంచాయతీ చింతలపల్లె గ్రామానికి చెందిన మైనర్ బాలిక రెండు రోజుల క్రితం అదృశ్యమైంది. ప్రత్యేక తరగతుల నిమిత్తం కళాశాలకు వెళ్లిన బాలిక ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం



చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరానికి చెందిన వాన్మది (26) అనే వివాహిత కనిపించడం లేదంటూ ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చామంతిపురానికి చెందిన వాన్మది నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తుంది. శుక్రవారం తన భర్తతో గొడవపడి .. ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ భాస్కర్ తెలిపారు. ఆమె ఆచూకీ తెలిస్తే డయల్ 100, 9440796707 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

అద్దె కార్లకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సమగ్ర శిక్ష శాఖలో అద్దెకు కార్లు ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వివిధ విభాగాల అధికారులు అద్దె కార్లు పెట్టుకునే అవకాశం ఉందన్నారు. కార్ల యజమానులు సమగ్ర శిక్ష శాఖకు దర ఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9440172422 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కేసుల పరిష్కారానికి సహకరించండి



న్యాయవాదులకు ట్రోఫీ అందజేస్తున్న జిల్లా జడ్జి భీమారావు

చిత్తూరు అర్బన్: కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదుల సహకారం అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు అన్నారు. స్థానిక బార్ కార్యాలయంలో శుక్రవారం బార్ అధ్యక్షుడు రాజేంద్ర రెడ్డి, కార్యదర్శి అశోక్ ఆనంద్ యాదవ్ ఆధ్వర్యంలో చిత్తూరు న్యాయవాదుల సంఘం వార్షిక వేడుకలను నిర్వహించారు. జడ్జి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కేసుల పరిష్కార సమయంలో బెంచ్‌కు న్యాయవాదులకు మధ్య సంబంధాలు ఉంటేనే సామాన్యుడికి న్యాయం జరుగుతుందన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్క న్యాయవాదీ కృషి చేయాలన్నారు. కాగా జిల్లాకు కొత్తగా వచ్చిన ముగ్గురు నూతన న్యాయమూర్తులను బార్ అసోసియేషన్ నాయకులు సన్మానించారు. అలాగే న్యాయవాదుల వేసవి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపించిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర న్యాయవాద మండలి సభ్యులు నల్లారి ద్వారకనాథరెడ్డి, న్యాయవాదులు రవీంద్రనాథ్, సూర్య ప్రతాప్ పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు: యువతి మృతి

పూతలపట్టు: మండలంలోని పాలకూరు సమీపంలో శుక్రవారం జాతీయరహదారిపై ఎదురుగా వస్తున్న లారీని ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, ఓ యువతి మృతి చెందింది. వివరాలు.. బెంగళూరులోని జేపీ నగర్‌కు చెందిన శంకర్(47), స్నేహ(20), షష్టి(18), రఘు(40) కారులో తిరుమలకు బుధవారం రాత్రి బయలుదేరారు. గురువారం శ్రీవారిని దర్శించుకున్నారు. శుక్రవారం వేకువజామున తిరుగుప్రయాణమయ్యారు. మార్గంమధ్యలో కారు అదుపుతప్పి లారీని ఢీకొంది. ఈ ప్రమాదం షష్టి(18) అక్కడికక్కడే మృతి చెందింది. క్షతగాత్రులను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడు..



చరణ్ (ఫైల్)

సోమల : మండలంలోని కొర్లకుంటవారిపల్లె ప్రాజెక్టులో శుక్రవారం మధ్యాహ్నం ఈతకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. వివరాలు.. పొదలగుంటపల్లెకు చెందిన ధనుంజయ కుమారుడు చరణ్(18) మామిడి కోత పనులకు కూలికి వెళ్లాడు. ఈ క్రమంలో స్నేహితుడితో కలిసి ఈత కొట్టేందుకు ప్రాజెక్టులో దిగి గల్లంతయ్యాడు. గ్రామస్తులు వెంటనే చరణ్ మృతదేహాన్ని వెలికి తీశరు. పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు.

సారా విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఈబీ అధికారులు

చిత్తూరు అర్బన్: మండలంలోని తుమ్మింద గ్రామంలో సారా విక్రయిస్తున్న చంద్రయ్య అనే వ్యక్తిని ఎస్‌ఈబీ అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. దాడిలో సీఐ జోగేంద్ర, ఎస్‌ఐ బాబు, సిబ్బంది బాబు, శంకర్, నాయక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తి..

తిరుపతి రూరల్: స్నేహితుడి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్లి ఒకరిపై రాళ్లతో దాడి చేయడమే కాకుండా మరోవ్యక్తిని కత్తితో పొడిచిన కేసులో ముద్దాయి ఫైరోజ్‌ను శుక్రవారం ఎంఆర్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఫైరోజ్ పాత ముద్దాయి అని, అతడిపై బైక్ చోరీ కేసులు కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సురేంద్రరెడ్డి తెలిపారు.

పరిపాలనాధికారిగా ప్రసన్నకుమార్‌రెడ్డి



తిరుపతి లీగల్ : రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు పరిపాలనాధికారి (చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గా ఎల్.ప్రసన్నకుమార్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎర్రచందనం కేసుల పరిష్కారం కోసం ప్రభుత్వం గత ఏడాది తిరుపతిలో కోర్టు ఏర్పాటుచేసింది. మొట్టమొదటి పరిపాలనాధికారిగా ఎల్.ప్రసన్నకుమార్‌రెడ్డిని రాష్ట్ర హైకోర్టు ఏర్పాటుచేయడం విశేషం. ఆయన ఇదివరకు కడప 7వ అదనపు జిల్లా జడ్జి కోర్టు సీఏఓగా విధులు నిర్వహించేవారు. రాష్ట్ర హైకోర్టు కడప నుంచి తిరుపతి ఎర్రచందనం విచారణ కోర్టుకు బదిలీ చేయడంతో శుక్రవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఎల్.ప్రసన్నకుమార్‌రెడ్డి ఇదివరలో ఉమ్మడి చిత్తూరు జిల్లా లోని వివిధ కోర్టులలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. ఆయన బాధ్యతలు తీసుకున్న సందర్భంగా తిరుపతిలో వివిధ కోర్టులకు చెందిన సిబ్బంది, న్యాయవాదులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

గుంటూరు విద్యార్థులకు పలమనేరులో ఈకేవైసీ

- విద్యార్థుల ఇబ్బంది లేకుండా సాయం చేసిన సచివాలయ సిబ్బంది



చిన్నూరు సచివాలయంలో గుంటూరు విద్యార్థులకు ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

పలమనేరు: బెంగళూరులో అప్రెంటీస్‌షిప్ శిక్షణ పొందుతున్న బీటెక్ విద్యార్థులు జగనన్న విద్యాదీవెన లబ్ధి పొందేందుకు ఇబ్బంది పడకుండా పలమనేరులోని సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ఈకేవైసీ చేయించారు. గుంటూరుకు చెందిన బీటెక్ ఫైనలియర్ విద్యార్థులు కొందరు అప్రెంటీషిప్‌లో భాగంగా బెంగళూరులోని పలు కంపెనీలో శిక్షణ పొందుతున్నారు. వీరంతా జగనన్న విద్యాదీవెన పథకం కింద లబ్ధి పొందేందుకు ఫింగర్ ప్రింట్లు స్వగ్రామాల్లో పెట్టాలనే ఆదేశాలతో సొంత ప్రాంతాలకు వెళ్ళాల్సి వచ్చింది. దూర ప్రాంతానికి వ్యయ ప్రయాసలకోర్చి వెళ్లడం ఇబ్బందిగా ఉందని స్థానిక ఏపీ ఎన్జీవోలను ఆశ్రయించారు. దీంతో పలమనేరు సమీపంలోని చిన్నూరు సచివాలయంలో అక్కడి వెల్ఫేర్ అసిస్టెంట్ వీరందరికీ ఈకేవైసీ చేయించారు. ఇందుకు సహకరించిన ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు ఆనందబాబు, వార్డు వెల్ఫేర్ సెక్రెటరీ రమణకు బీటెక్ విద్యార్థులు కృతజ్ఞతలను తెలిపారు.

అద్దెకు ఆర్టీసీ దుకాణాలు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ బస్టాండ్ పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలను అద్దెకు ఇవ్వడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీపీటీఓ చెంగల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 94 దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి టెండర్లు నిర్వహిస్తున్నామని, ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. అదేరోజు మూడు టెండర్లు ఖరారుచేయనున్నట్టు వెల్లడించారు. అదనపు సమాచారం కోసం వ్యాపారులు 9959225684 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

జిల్లాలో ఖాళీగా ఉన్న దుకాణాల వివరాలు

ప్రాంతం	ఖాళీగా ఉన్న దుకాణాలు
తిరుపతి శ్రీహరి బస్టాండ్	- 13
తిరుపతి శ్రీనివాస బస్టాండ్	- 13
తిరుపతి ఏడుకొండల బస్టాండ్	- 02
తిరుపతి కమర్షియల్ కాంపెక్స్	- 08
భాకరాపేట బస్టాండ్	- 03
పుత్తూరు	- 01
శ్రీకాళహస్తి	- 07
సత్యవేడు	- 01
వరదయ్యపాలెం	- 01
కోట	- 10
నాయుడుపేట	- 09
గూడూరు	- 03
వెంకటగిరి	- 06
రేణిగుంట	- 02
రంగంపేట	- 02
చంద్రగిరి	- 01
పాకాల	- 06
నేంద్రగుంట	- 01
ఏర్పేడు	- 01
నాగలాపురం	- 04

మహా అంగప్రదక్షిణ భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

- డయల్ యువర్ ఈఓలో ఏవీ ధర్మారెడ్డి

తిరుమల: శ్రీవారి ఆలయ మాడవీధుల్లో మహా అంగప్రదక్షిణ చేసే భక్తులకు ఇబ్బంది లేకుండా రాత్రివేళ పుష్కరిణిని తెరిచి ఉంచుతామని, తిరుమలనంబి ఆలయం వద్ద గేటు తీసి ఉంచి సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేస్తామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో భక్తుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న : అంగప్రదక్షిణ టోకెన్లు ఆన్‌లైన్‌లో 2 మాత్రమే బుక్ అవుతున్నాయి. 4కు పెంచండి. – అపర్ణ, అనంతపురం

ఈవో : ఒక భక్తుడు రెండు టికెట్లు మాత్రమే బుక్ చేసుకునే అవకాశం ఉంది. ఈ టోకెన్లు పొందలేని వారు ఇతర విధానాల్లో దర్శనం చేసుకోవచ్చు. ప్రతినెలా 18 నుంచి 20వ తేదీ వరకు ఆర్జిత సేవల లక్కీ డిప్ కోసం నమోదు చేసుకోవచ్చు. 20 నుంచి 22వ తేదీ వరకు డిప్‌లో టికెట్లు పొందిన వారు సొమ్ము చెల్లించి ఖరారు చేసుకోవాలి. ఇతర ఆర్జిత సేవా టికెట్లు 21న విడుదల చేస్తారు. శ్రీవాణి, అంగ ప్రదక్షిణం, వృద్ధులు, దివ్యాంగుల దర్శన టికెట్లు 23న విడుదలవుతాయి. అదేవిధంగా రూ.300 దర్శన టిక్కెట్ల కోటాను 24న, గదుల కోటాను 25న విడుదల చేస్తాం.

ప్రశ్న : కల్యాణోత్సవానికి పిల్లలను అనుమతి ఇస్తారా.– శ్రీనివాస్, చిలకలూరిపేట

ఈవో : శ్రీవారి ఆలయంలో కల్యాణ మండపం వద్ద స్థలం తక్కువగా ఉన్న కారణంగా ఎక్కువ మందిని అనుమతించే అవకాశం లేదు. మైనర్లను తల్లిదండ్రులతో పాటు అనుమతిస్తాం.

ప్రశ్న : కోవిడ్‌లో ఆర్జిత సేవా టికెట్లు బుక్ చేసుకున్న వారికి బ్రేక్ దర్శనం టికెట్లు ఇస్తామని చెప్పారు. అలా కాకుండా అర్చన, తోమాల లాంటివి ఇవ్వండి. – వెంకటేశ్వర్లు, పీలేరు

ఈవో : ఆర్జిత సేవా టికెట్లు అడ్వాన్స్ బుకింగ్ షెడ్యూల్ చేయడం కష్టమవుతుంది. తోమాల, అర్చన లాంటి సేవల కోసం లక్కీడిప్‌లో ప్రయత్నించండి.

ప్రశ్న : శ్రీవారి సేవాసదన్‌లో రిజిస్ట్రేషన్ ఆలస్యం అవుతోంది. – నరసయ్య, ఆదిలాబాద్

ఈవో : ఇకపై ఆ సమస్య లేకుండా చేస్తాం.

ప్రశ్న : అలిపిరి కాలినడక మార్గంలో స్తంభాలకు గోవింద నామాలు ఉండేవి, తిరిగి రాయించండి. – వంశీ, బాపట్ల

ఈవో : అలిపిరి కాలినడకమార్గం పునర్నిర్మించాం. నూతన స్తంభాలకు గోవింద నామాలు రాయిస్తాం.

ప్రశ్న : ధర్మ ప్రచారం చేసేందుకు ప్రతి మండలంలోనూ సేవా కేంద్రం పెట్టండి. – గుప్తా, ప్రకాశం

ఈవో : హిందూ ధర్మ ప్రచార పరిషత్ ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : మహా అంగప్రదక్షిణ చేయడానికి ఇబ్బందికరంగా రాత్రివేళ పుష్కరిణిని మూసేస్తున్నారు, తిరుమలనంబి ఆలయం వద్ద గేటు వేస్తున్నారు. – అశోక్, చెన్నై

ఈవో: మహా అంగప్రదక్షిణ చేసే భక్తులకు స్నానానికి ఇబ్బంది లేకుండా రాత్రి వేళ పుష్కరిణిని తెరిచి ఉంచుతాం. తిరుమలనంబి ఆలయం వద్ద గేటు లేకుండా చూస్తాం.

ప్రశ్న : గదుల తాళాలు ఇచ్చినప్పటి నుంచి సమయం లెక్కించేలా చూడండి. – పార్థసారథి, విజయనగరం

ఈవో : పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : లడ్డూ నాణ్యత సరిగా ఉండడం లేదు. అన్నదానంలో బియ్యం నాణ్యత సరిగా లేదు. – వెంకట్, కాకినాడ

ఈవో : లడ్డూ తయారీకి నాణ్యమైన ముడి సరుకులను టెండర్ ద్వారా కొనుగోలు చేస్తున్నాం. మరింత నాణ్యంగా ఉండేలా పోటు సిబ్బందికి సూచనలు ఇస్తాం. అన్నదానంలో నాణ్యమైన బియ్యాన్ని ఉపయోగిస్తున్నాం. భోజనం నాణ్యతను తరచూ పరిశీలిస్తున్నాం.